నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శనివారం | డిసెంబర్ 28, 2024 | www.navatelangana.com

సెలవురోజు సైతం ఇండ్ల సర్వే

నవతెలంగాణ-బోధన్

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంతో సంతాప సూచకంగా రాష్ట్రమంతా ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటిస్తే పంచాయతీ సిబ్బందికి మాత్రం అదేమీ వర్తించడం లేదు. అధికారుల ఆదేశాల మేరకు గడువులోపల ఇంటింటికి తిరిగి ఇందిరమ్మ ఇండ్లను సర్వే పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో తప్పని పరిస్థితిలో గ్రామ పంచాయతీల సిబ్బంది ఇంటింటి సర్వేకు బయలుదేరారు. సాలూర మండల కేంద్రంలో మొత్తం 1400 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకోవడంతో పంచాయతీ సిబ్బంది సెలవు రోజులలో సైతం సర్వే చేస్తున్నారు. రెండు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్న ఇప్పటికి 300 వరకు మాత్రమే ఇండ్ల సర్వే చేసినట్లు సమాచారం. సర్వర్ సమస్యతో సర్వే చేయడంలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో ఇబ్బందులు ఎదురవుతూన్నాయని వారు పేర్కొన్నారు.

బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై చర్చించేందుకు
నేడు రైతులతో ఎమ్మెల్యే సమావేశం

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ పట్టణంలోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభించడంలో భాగంగా సాధ్యాసాధ్యాలపై నేడు (శనివారం) ఎడపల్లి మండల కేంద్రంలోని సరయు ఫంక్షన్ హాల్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు కలెక్టర్ హనుమంత్‌రెడ్డి రైతులతో సమావేశం కానున్నారు. పాత ఫ్యాక్టరీని తెరిపించడమా..? లేకుంటే కొత్త ఫ్యాక్టరీని నిర్మించడమా.. చెరుకు పంట సాగుకు రైతులు సిద్ధమా తదితర అంశాలపై రైతులతో మాట్లాడనున్నారు. కావున జిల్లాలోని రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి షుగర్ కేన్ కమిషనర్ మల్సూర్ సైతం హాజరుకానున్నట్టు తెలిపారు.

హస్తానిదే ఆధిపత్యం

- ఉమ్మడి జిల్లాలో బలం పెంచుకుంటున్న కాంగ్రెస్
- అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతున్న నాయకులు
- ఇప్పటికే పలు మున్సిపాలిటీలు కైవసం
- ప్రతిపక్ష పాత్రకు పరిమితమైన బీఆర్ఎస్, బీజేపీ
- ప్రజాపక్షాన నిలుస్తున్న సీపీఐ(ఎం), వామపక్షాలు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. కిందటేడాది వరకు కారు జోరు కనబర్చగా.. ఒక్క ఏడాదిలోనే పరిస్థితి అంతా తారుమారైంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఆధిపత్యం కనబరుస్తోంది. అధికార పార్టీగా ప్రజల్లో మరింత బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండటంతో ప్రజల్లోనూ ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరి ఏర్పర్చుకుంటోంది. రాజకీయంగా ఉమ్మడి జిల్లాలో మరింత పట్టుసాధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. గడువు ముగియకముందు పలు జడ్పీలను, పలు మున్సిపాలిటీలు కైవసం చేసుకోగా.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తాచాటేందుకు సిద్ధమవుతోంది. ఇక ఉమ్మడి జిల్లాలో మూడు అసెంబ్లీ సీట్లు గెలిచిన బీజేపీ ప్రతిపక్ష పాత్రకే పరిమితమవుతోంది. ఇక కిందటేడాది వరకు తొమ్మిది మంది ఎమ్మెల్యే స్థానాలతో అగ్రస్థానంలో ఉన్న బీఆర్ఎస్ ప్రస్తుతం ఒక సీటుకే పరిమితమై ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజలకు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. కాగా ఇటీవల జిల్లా మహాసభలు నిర్వహించుకున్న సీపీఐ(ఎం).. ప్రజా సమస్యల పరిష్కారం, అధికార పార్టీలు ఇచ్చిన హామీల అమలుపై ప్రజల పోరాటాలకు నూతన ఉత్సాహంతో ముందుకెళ్తుంది. సీపీఐ(ఎం) సహా.. ఇతర వామపక్ష పార్టీలు ప్రజాపక్షం నిలుస్తూ పోరాటాలు చేపడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది అధికార పార్టీదే హవా కొనసాగుతోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మెరుగైన పనితీరు కనబరుస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డితో పాటు జుక్కల్ అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీటితో పాటు జహీరాబాద్ ఎంపీ స్థానంలోనూ విజయం సాధించింది. కాగా బాన్సువాడ నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన మాజీ స్పీకర్ పోచారం.. నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్‌కు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు ఎమ్మెల్యే స్థానాలతో పాటు ఒక ఎంపీ స్థానంలో గెలుపొందింది. ఇక నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, కామారెడ్డి స్థానాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. నిజామాబాద్ ఎంపీ స్థానంలోనూ బీజేపీ విజయం సాధించింది. కేంద్రంలో అధికారంలో ఉన్నా.. రాష్ట్రంలో మాత్రం ప్రతిపక్ష పాత్రకే పరిమితమయ్యారు. ఇక బాల్కొండ స్థానం నుంచి మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి గెలుపొందడంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.





కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానాల్లోనూ కాంగ్రెస్ ఇన్‌చార్జీలే హవా కొనసాగిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాలతో పాటు అభివృద్ధి పనుల మంజూరులోనూ ప్రభుత్వం నియోజకవర్గాల ఇన్‌చార్జీలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక అధికారంలోకి రాగానే బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో పలు మున్సిపాలిటీలను సైతం హస్తగతం చేసుకుంది. వీటితో పాటు పలువురు స్థానిక సంస్థలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. పలువురు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కీలక నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ ఎన్నికల నాటి కంటే మరింత బలోపేతంగా కనిపిస్తోంది. ఇదే ఊపుతో రానున్న స్థానిక సంస్థల్లోనూ సత్తాచాటేందుకు సిద్ధమవుతోంది.

మరోపక్క ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌తో పోటీగా ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ స్థానంలో విజయం సాధించిన బీజేపీ సైతం రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతుంది. కాగా ప్రభుత్వ వైఫల్యాలను, వ్యతిరేకతను క్యాష్ చేసుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి మునుపటి పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఇక ఇటీవలే జిల్లా మహాసభలు పూర్తిచేసుకున్న సీపీఐ(ఎం) సైతం ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా జనంలో మరింత పట్టుసాధించాలని భావిస్తోంది. మహాసభల అనంతరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సానుభూతి పరులకు శిక్షణా తరగతులు నిర్వహించింది.

పథకాల అమలుతో సానుకూల వైఖరి..!

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్తు సౌకర్యం, రూ.500గ్యాస్ సబ్సిడీ, రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయడం, ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనం జమ చేయడం, ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల ఎంపిక ప్రక్రియ చేపడుతుండటం వంటి కార్యక్రమాలతో ప్రభుత్వానికి ప్రజల్లో సానుకూల వైఖరి తీసుకువచ్చాయి. మరోపక్క ఖరీఫ్‌లో రైతు భరోసా ఇవ్వకపోవడం.. రూ.2లక్షల వరకు రుణమాఫీ ఇంకా పూర్తిస్థాయిలో జరగకపోవడంతో ఆయా రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక ఆరుగ్యారెంటీల్లో భాగంగా ప్రభుత్వం హామీనిచ్చిన పింఛన్ రూ.4వేల పెంపు, రేషన్‌కార్డుల జారీ, మహిళలకు రూ.2500చొప్పున అందజేయడం వంటి వివిధ పథకాల అమలు కోసం జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీటిని కూడా అమలు చేస్తే ప్రజల్లో మరింత సానుకూల దృక్పథం ఏర్పడటంతో పాటు పార్టీ బలోపేతానికి కూడా దోహదం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.









మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

భారతజాతి గర్వించే ఆర్థిక వృక్షం మన్మోహన్‌సింగ్

- ఆయన సేవలు ఎన్నటికీ మరువలేనివి
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారత జాతి గర్వించే ఆర్థిక వృక్షం మన్మోహన్ సింగ్ అని దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. దేశ ఆర్థిక సంస్కర్త మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు డాక్టర్ మన్మోహన్ సింగ్ గురువారం తుది శ్వాస విడిచిన సందర్భంగా శుక్రవారం బాల్కొండ నియోజకవర్గం మానాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జలపతి ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పాల్గొని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఆర్థిక రంగంలో ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిలిపిన మన్మోహన్ సింగ్ మరణం తీరనిలోటన్నారు. పార్టీ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ రథసారధిగా పార్టీ కోసం, ప్రధానిగా దేశ ప్రజలకు హక్కులు కల్పించడంలో మన్మోహన్ సింగ్ ఆలోచన చిత్తశుద్ధి ఎన్నటికీ మరువలేనివన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చి దేశ ప్రజలు ప్రతి ఒక్క విషయాన్ని తెలుసుకునే స్వేచ్ఛను హక్కును కల్పించారని కొనియాడారు. 100 రోజుల ఉపాధి హామీ పనిని తీసుకువచ్చి కూలిని అందించారన్నారు. ఆయన 10 సంవత్సరాల ప్రధానిగా చేసిన కాలంలో రూపాయి విలువను ఏ మాత్రం తగ్గకుండా చూశారని తెలిపారు. పోడు భూముల పట్టాలు అందించిన వ్యక్తి అని అన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు ఎన్నటికి మరువలేనివన్నారు. దేశం ఒక మంచి ఆర్థికవేత్తను, సలహాదారున్ని, మంచి మనిషిని కోల్పోయిందని పేర్కొం టూ మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మానాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, మోహన్, రవీందర్, హరిదాసు, రాజు నాయక్, గురుదాస్, గజంలాల్, బంకట్లల్, భూమయ్య పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయం వద్ద చోరీకి యత్నం

- డయల్ 100కు ఫోన్‌తో దొరికిన నిందితుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో డయల్ 100కు ఫోన్ చేయడంతో దొంగతనం చేయడానికి ప్రయత్నించి విఫలమైన దొంగను పోలీసులు పట్టుకున్నారు. మూడవ పోలీస్ స్టేషన్ ఇంచార్జ్ ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భక్త మార్కండేయ మందిరము వద్ద శుక్రవారం తెల్లవారు జామున అందాజా రెండు గంటల సమయంలో ఒక వ్యక్తి దొంగతనం చేయుటకు ప్రయత్నిస్తుండగా.. డయల్ 100కు ఫోన్ వచ్చింది. పోలీసులు అక్కడికి వెళ్లగా.. అప్పటికే దొంగ పారిపోయినాడు. దొంగ కోసం వెతుకుతూ ఉండగా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ బ్లూ కోట్స్ సిబ్బంది గంగాధర్, నిఖిల్ చాకచాక్యంగా దొంగను పట్టుకున్నారు. మందిరం పూజారి జంగం నాగభూషణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఎస్ఐ కేసు నమోదు చేసి చోరికి ప్రయత్నించిన ఉగాడే దత్తుని అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

29న నిజామాబాద్‌కు ఎమ్మెల్సీ కవిత

- డిచ్‌పల్లి నుంచి సుభాష్‌నగర్ వరకు భారీ ర్యాలీ : బీఆర్ఎస్

నవతెలంగాణ-కంఠేశ్వర్




అక్రమ కేసులో బీజేపీ పార్టీ ఎన్ని నిర్బంధాలకు గురి చేసినా మొక్కవోని ధైర్యంతో ప్రజా క్షేత్రంలో పోరాటం సాగిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ నెల 29వ తేదీన నిజామాబాద్‌కు వస్తున్నట్టు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి నిజామాబాద్‌కు చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ క్రమంలో డిచ్ పల్లి వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలుకుతారని తెలిపారు. అనంతరం బైపాస్ రోడ్డు మీదుగా సుభాష్ నగర్ ఎస్ఎఫ్ఎస్ సర్కిల్ వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఎస్ఎఫ్ఎస్ సర్కిల్ వద్దనున్న తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్సీ కవిత పుష్పాంజలి ఘటించి అక్కడే ప్రజలను, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్సీ కవిత ప్రసంగిస్తారని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

కాలువలకు జలకళ..

- ఎస్సారెస్పీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్



ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) పరిధిలోని కాలువలకు నీటిని విడుదల చేయడంతో జలకళ సంతరించుకుంది. కాలువల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయడంతో వడివడిగా పరుగులు తీస్తుంది. ఎస్సారెస్పీ నీటి మట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1090.6 అడుగుల (78.868 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. అయితే ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు సాగు అవసరాల కోసం కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు 5500 క్యూసెక్కులు, లక్ష్మి కెనాల్‌కు 175, అలీసాగర్ ఎత్తిపోతలకు 415, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు నుంచి 7848 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1087.4 అడుగుల (67.698 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు తెలిపారు.



బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగస్తులు

బిక్షాటన చేస్తూ నిరసన

- మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించిన సర్వశిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం భిక్షాటన చేస్తూ నిరసన చేపట్టారు. అంతకుముందు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతి పట్ల శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి బిక్షాటన చేశారు. తమకు కనీస వేతనాలు లేకుండా 18 సంవత్సరాల నుంచి పనిచేశామని, ప్రభుత్వం తమ సేవలను గుర్తించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వటం లేదని బిక్షాటన చేస్తూ వరు ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో, భవిత సెంటర్ విద్యార్థులకు విద్యా బోధనకు తాము దూరమై సమస్యల కోసం పోరాటం చేస్తున్న ప్రభుత్వం అన్ని తెలిసినా తెలవనట్టు నటించడం విడ్డూరమన్నారు.

ఇది నిజంగా ప్రజాపాలనైతే మహిళా ఉద్యోగులు రోడ్లను ఎక్కి భిక్షాటన ద్వారా నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం మొండి వైఖరితో ఉంటుందని ఆ వైఖరి మానుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమను రెగ్యులర్ చేస్తామన్న ముఖ్యమంత్రి హామీ ఏమైందని ఆవేదన వ్యక్తం చేశారు. 30 తేదీ నా జరిగే క్యాబినెట్ సమావేశంలో తమ అంశాన్ని చర్చించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పైన పూర్తి విశ్వాసం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు ,రాములు, సంతోష్ రెడ్డి,వనజ, శైలజ వీణ, లావణ్య,శ్రీవాణి, కాళిదాస్, కళ్యాణ్, సాయిలు, శ్రీను,రాజు, లింగం, రమేష్, సంధ్య, మాధవి 400 మంది పాల్గొన్నారు.

డెత్ మిస్టరీపై అనేక ఊహాగానాలు

- సామాజిక మాధ్యమాల్లో అనేక ప్రచారాలు
- పోలీసులపై పోలీస్ శాఖ విచారణ
- విచారణ అంశాలు వెలుగులోకి వచ్చేనా..?
- కీలకంగా మారనున్న ఎస్ఐ భార్య వాగ్మూలం



ఎస్ఐ సాయికుమార్



కానిస్టేబుల్ శృతి



ఆపరేటర్ నిఖిల్

నవతెలంగాణ-కామారెడ్డి

అడ్లూర్ఎల్లారెడ్డి చెరువులో ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, మరో కంప్యూటర్ ఆపరేటర్ మృతిచెందిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. కాగా వీరి డెత్ మిస్టరీపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. కాగా పోలీసులపై పోలీస్ శాఖ వారు చేపడుతున్న విచారణకు సంబంధించిన అంశాలు.. బయటకు తెలియనిచ్చేనా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో చాలా గోప్యంగా విచారణ చేపడుతున్నట్టు సమాచారం. కాగా ఎస్ఐ సాయికుమార్ భార్య వాగ్మూలం కీలకంగా మారనుంది. అయితే ముగ్గురి ఫోన్ కాల్స్, వాట్సప్ చాట్ హిస్టరీ ఇప్పటికే పోలీసులు సేకరించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నట్టు సమాచారం.

గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఎస్సై, మహిళా కానిస్టేబుల్, ఆపరేటర్‌ల మృతిపై అనేక సందేహాలు నెలకొన్నాయి. వారు ఎలా మృతి చెందారు, ఎందుకు మృతి చెందారు.. అసలు ఏం జరిగింది అనే విషయాలపై ఎక్కడ ఎవరికి ఎలాంటి సమాచారం లేదు. అయినప్పటికీ సామాజిక మాధ్యమాలలో మాత్రం ఎవరికి తోచిన విధంగా వారు వివరిస్తున్నారు. వారు ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్లారు. వారు ఎలా కలిశారు..? అక్కడ జరిగిన సంభాషణ ఏమిటి అనే విషయాలు తదితర అంశాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. విచారణ అధికారిగా సదాశివనగర్ సీఐ సంతోష్‌కుమార్ కొనసాగుతున్న విషయం విధితమే.

సాయికుమార్ ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదు : కుటుంబీకులు

ఎస్ఐ సాయికుమార్ పేదరికం నుంచి కష్టపడి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వ్యక్తి అని, చాలా ధైర్యవంతుడు అని ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదని కుటుంబ సభ్యుల పేర్కొంటున్నారు. అతను ఎస్సై స్థాయిలో ఉండి పదిమందికి ధైర్యాన్ని చెప్పే వ్యక్తి సాధారణం గానే ఆత్మహత్య చేసుకోడు. అలాంటి వ్యక్తి ఎలా ఆత్మహత్య చేసుకుంటాడు అని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా తాజాగా ఆయన ఆత్మహత్యల నివారణపై మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సోషల్ మీడియాలో అనేక ప్రచారాలు

కాగా వీడి డెత్ మిస్టరీపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సోషల్‌మీడియాలో ఒక అడుగు ముందకేసి అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. ప్రేమ, వివాహేతర బంధం, వివాహం తదితర అంశాలు ముందుకు తీసుకొచ్చి ప్రచారం చేస్తున్నారు. కాగా విచారణ పూర్తయిన తర్వాత పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడిస్తేనే అసలు అంశాలు వెలుగుజూసే అవకాశం ఉంది.

ఎస్సై భార్య వాగ్మూలం కీలకంగా మారనుందా?

ఎస్సై సాయికుమార్ మృతి చెందిన తర్వాత అతని భార్య వాగ్మూలం కీలకంగా మారనుంది. ఆమె చెప్పిన అంశాల ఆధారంగా సైతం విచారణ కొనసాగుతోంది. కాగా ముగ్గురు ఫోన్ మాట్లాడిన సంభాషణతో పాటు వాట్సప్ హిస్టరీని ఇది వరకే సేకరించారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అంశాలు బయటకు తెలియజేస్తారా లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తమ డిపార్ట్‌మెంట్ పరువు పోతుందని కొన్ని విషయాలను దాస్తారా? అనే విషయాలు మాత్రం ఇప్పటినుండే ప్రజల్లో అనుమానాలను కలగజేస్తున్నాయి.

పట్టపగలే వెలుగులు



నవతెలంగాణ-భీంగల్‌రూరల్
మండలంలోని కుప్కాల్ గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఇలా పగటిపూట వీధిదీపాలు వెలిగితే విద్యుత్ వృథా అవుతుందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు స్విచ్లు ఉన్నప్పటికీ పనిచేయటం లేదని, మరికొన్ని చోట్ల స్తంభానికి పట్టిల ద్వారా బిగించిన విధి దీపాలు ఊడిపోవడంతో బల్బు వైర్ ద్వారా స్తంభానికి వేలాడుతూ ఉన్నాయని, పగలు రాత్రి అనే తేడా లేకుండా దీపాలు వెలుగుతూనే ఉన్నాయని స్థానికులు తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

30న చలో నల్గొండ



నవతెలంగాణ-ఆర్మూర్
భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30న నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్టు సిపిఐ జిల్లా. కార్యవర్గ సభ్యులు ఆరెపల్లి సాయిలు అన్నారు. పట్టణంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోమశ్రీను, మాదరి నరేష్, కుంట మంగ, దుర్గం రాజేందర్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలించిన అదనపు కలెక్టర్



మాట్లాడుతున అదనపు కలెక్టర్

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్
మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలనకోసం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు అంకిత్ శుక్రవారం వెంకటాపురం, కుక్కునూరు గ్రామాలను సందర్శించారు. సర్వేలో భాగంగా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటిని లబ్ధిదారుని ఫొటో, ఇంటి ఫొటో లబ్ధిదారునికిగల ప్లాటు వివరాలు, అన్ని డాక్యుమెంట్లు క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా సర్వేయర్లు కార్యదర్శులకు) సూచించారు. దరఖాస్తుదారులను స్వయంగా వారి యొక్క ఇంటి స్థితిగతులు కుటుంబ పరిస్థితులు ఎక్కడ నివసిస్తున్నారు.. ఏం పని చేస్తున్నారు.. అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు కుక్కునూరు ఆశ, వెంకటాపూర్ ప్రియాంక, గ్రామస్తులు పాల్గొన్నారు.

4 లోగా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తాం

టీజీకేఎస్‌యూ

నవతెలంగాణ-ఏర్గట్ల
వచ్చే సంవత్సరం జనవరి 4లోగా తమ సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని పంచాయతీ కార్మికులు తెలిపారు. ఈ సందర్భంగా టీజీకేఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుక మారుతి మాట్లాడుతూ... జీఓ నెంబర్ 51 ని సవరించాలని, తెలంగాణ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి కేటగిరీల వారిగా వేతనాలు పెంచాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి, బకాయి వేతనాలు చెల్లించాలని అన్నారు. డిసెంబర్ 6న తమ సమస్యలను విన్నవించినప్పటికి ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించలేదని తెలిపారు. అందువల్ల ఈ నెల 27,28 తేదీల్లో టోకెన్ సమ్మెకు వెళ్తున్నామని అన్నారు. పంచాయతీ కార్మికుల మండలాధ్యక్షులు సాయన్న, కారోబార్లు సాయిరాం, హన్మాండ్లు, రఫీక్, రాకేష్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఐకి సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్
మండలంలోని లక్కోరా గ్రామంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉట్నూర్ సుభాష్ ను శుక్రవారం సన్మానించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారులు కామారెడ్డి జిల్లా నూతన కమిటీని ఇటీవల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రావు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.రవీందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఉట్నూర్ సుభాష్, ఉపాధ్యక్షులుగా నీలం లింగం, రాజలింగం, సంతోషిని రెడ్డి, కార్యదర్శిగా సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రమేష్, నర్సింలు, జ్యోతి, కోశాధికారిగా భూమయ్య ఎన్నిక కాగా.. ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డా.బి.నిజాం, పబ్లిక్ సెక్రెటరీగా డా.బి.మౌనిక, ఆఫీస్ సెక్రెటరీగా శ్రీనివాస్ రెడ్డి, కల్చరల్ సెక్రెటరీగా ప్రశాంత్ రెడ్డి, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రెటరీగా డా.సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఫౌరాబోద్దీన్, ఠాకూర్, శశికిరణ్, సవిత రెడ్డి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీలో లక్కోర గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఫిషర్ మెన్ సెల్ కో కన్వీనర్ బట్టు లక్ష్మణ్, పడగల్ మాజీ సొసైటీ చైర్మన్ సీనియర్ నాయకులు దెగం రాములు, పిఏసిఎస్ వేల్పూర్ వైస్ చైర్మన్ బైరి శ్రీధర్, చేపూర్ గంగాధర్ వేల్పూర్ ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ చేపూర్ గంగాధర్, మాజీ 5వ వార్డ్ మెంబర్ మాడవేడి ప్రదీప్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

- పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్ లో శుక్రవారం గాదెపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న రావుల సుభాష్ పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, పీఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పెంట జలంధర్, తుమ్మల లక్ష్మణ్ పటేల్, డొంకేశ్వర్ పీఆర్టీయు మండల అధ్యక్షులు రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, నందిపేట్ పీఆర్టీయు అధ్యక్షులు భూషణ్, ప్రధాన కార్యదర్శి రమేష్, అసోసియేట్ అధ్యక్షులు బాలగంగాధర్, శంకర్ రావు, భోజరాం, నరేష్, సాయన్న,మండల విద్యాధికారి రామకృష్ణ, హెడ్మాస్టర్లు రావుల లింగారెడ్డి,భోజన్న,శ్రీనివాస్, పీఆర్టీయు రాష్ట్ర నాయకులు బండి ప్రసాద్, శివ ప్రసాద్, చిన్నారెడ్డి,సంతోష్ యాదవ్, షేక్ జాన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథి జిల్లా పీఆర్టీయు అధ్యక్షులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అంకితభావంతో సమయపాలన పాటిస్తూ రావుల సుభాష్ 40 వసంతాల ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలను కొనియాడుతూ ఎందరెందరో విద్యార్థుల్ని జాతి గర్వించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. సన్మాన గ్రహీత రావుల సుభాష్ మాట్లాడుతూ విద్యా రంగంలో 40 వసంతాలుగా ఎనలేని సేవలందించానని అందుకు సహకరించిన గ్రామస్తులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.చాలామంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు,డొంకేశ్వర్ మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఆర్టీయు నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శ్రద్ధాంజలి

నవతెలంగాణ- ఆర్మూర్
పట్టణంలోని పివిఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు శుక్రవారం శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు మనోహ్మన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో పెర్కిట్ శేఖర్ రెడ్డి ,,చిట్టి రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బసవన్నకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి



బసవన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ
తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మెలో భాగంగా 21వ రోజు బసవన్నకు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.రాజు, భూపేందర్ మాట్లాడుతూ.. 20 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు కూడా సమ్మెపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో వెన్నుముకైన సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా బసవన్నకు వినతి పత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు

ప్రభుత్వ పెద్దలు ఇకనైనా కళ్ళు తెరిచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలని, తక్షణమే రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత తీవ్రతం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమానికి సంఘీభావం తెలియజేయడానికి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సుదన్ లింగయ్య, పోషన్న, రాజేశ్వర్, విజయ్, లింగయ్య, ఎస్టియు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు కాంతారావు, పవన్ కుమార్, చంద్రశేఖర్, జాతీయవాద ఉపాధ్యాయ సంఘం నాయకులు కొండ రామ్మోహన్‌రావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు విజయ్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేజీబీవీలకు పంపొద్దు

కంఠేశ్వర్ : ఉపాధ్యాయులను కేజీబీవీ లకు పంపొద్దని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. 20 రోజులుగా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరానికి శుక్రవారం స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్య వర్గ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. కేజీబీవీలకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపే ఉత్తర్వులను వెంటనే నిలిపి వేయాలని కోరారు. పోరాటాన్ని నీరుగార్చే ప్రయత్నంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావొద్దని, ఎవ్వరూ కూడా కేజీబీవీ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పోవొద్దని ఉపాధ్యాయులను కోరారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు కూడా ఎస్ఎస్ఏ ఉద్యోగులపై ఒత్తిడి తీసుకొని రావొద్దని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ చూపి ఉద్యోగులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాతని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్, కాంత రావు,చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.




ట్రాక్టర్‌లతో తరలిస్తున్న ఇసుక

పగలు డంపు, రాత్రి తరలింపు

- ఇసుక మాఫియా జోరు షురూ
- రూ. 5 వేలకు ట్రాక్టర్ చొప్పున అమ్మకం

నవతెలంగాణ-మాక్లూర్
వర్షా కాలం వెళ్లిందంటే చాలు వాగులు, వంకలు, ఒర్రెలు, కాలువలు ఎక్కడ పడితే అక్కడ ఇసుక కనిపిస్తే చాలు పోగు చేసి అక్రమంగా అమ్ముకోవడానికి పన్నాగాలు వేస్తూ ఇసుకను తరలిస్తూ ఉంటారు ఇసుక మాఫియా. మండలంలోని మదన్ పల్లి తండాలో మాటు కాలువ నుంచి ఇసుకను తీస్తూ ఒక చోట డంపు చేస్తున్నారు. చిక్లి, గుంజిలిలో పెద్ద వాగులో నుంచి ఇసుకను తరలిస్తూ ట్రాక్టర్‌కు రూ. 5 వేల చొప్పున అమ్ముకుంటున్నట్లు సమాచారం. పగలు డంపు చేసి రాత్రి వేళలో ఇతర గ్రామాలకు తరలిస్తున్నారు. ఎక్కడ కూడా అధికారులు అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. అధికారుల కన్నుగప్పి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. మండల శివారులో నుంచి నవీపేట్ మండలం జన్నెపల్లి గ్రామ ఇసుక మాఫియా సైతం పెద్ద వాగులో ఇసుకను తరలిస్తున్నారు.

ఎక్కడా అనుమతులు లేవు...
ఎక్కడ ఇసుకను తీస్తున్నారో మాకు ఎలాంటి సమాచారం లేదు. ఇసుకను తీయడానికి ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
ఆర్ఐ షఫీ, మాక్లూర్




డంపు చేసిన ఇసుక

వరద కాలువలో దూకి ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రానికి చెందిన దొండి గంగా మోహన్ 45) గ్రామ శివారులోని వరద కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 25న మధ్యాహ్నం దొండి గంగా మోహన్ ఇంట్లో నుండి బయటకి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొంటూ ఈనెల 26న ఆయన భార్య దొండి గంగామణి ఫిర్యాదుఇవ్వగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఉప్లూర్ రోడ్డులోని వరద కాలువలో మృతదేహం ఉన్నదని సమాచారం అందగా వెళ్లి పరిశీలించారు. అది గంగా మోహన్ మృతదేహంగా గుర్తించారు. మృతదేహాన్ని వరద కాలువలో నుండి పైకి తీసి, శవ పంచనామ నిర్వహించి, పోస్టుమార్టమ్ నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గంగ మోహన్ మండల కేంద్రంలో పూల దుకాణం నిర్వహిస్తున్నారు.

ఆదుకుంటే పునర్జన్మ





నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన దొర సంతోష్ గౌడ్‌కు నాలుగు రోజుల క్రితం చిన్న మెదడులో నరం చితికిల పడి, రక్తస్రావం కావడంతో పక్షపాతానికి గురైనట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పక్షపాతానికి గురికావడంతో ప్రస్తుతం ఆయన జిల్లా కేంద్రంలోని శ్రీ కృష్ణ న్యూరో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంతోష్ గౌడ్ పరిస్థితి విషమంగా ఉండటంతో దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కుటుంబ సభ్యులు, సన్నిహితులు కోరుతున్నారు. ప్రస్తుతం ఆయన చికిత్స కోసం రోజుకు రూ.40 వేల రూపాయల ఖర్చు అవుతున్నట్లు స్నేహితులు తెలిపారు. భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉండడంతో ఆర్థిక భారంలో ఉన్నారు. ఈ సమయంలో ఆయనకు సహాయం అందిస్తే తిరిగి పునర్జన్మ ఇచ్చిన వారమవుతామని, దాతలు ఈ కింది నంబర్లకు 9440342119, 7799641188 ఫోన్ పే, గూగుల్ పే చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ప్రాధేయపడుతున్నారు..

క్షేమంగా ఇంటికి రప్పించండి

- కోటపాటికి విన్నవించిన కుటుంబ సభ్యులు



వినతిపత్రం అందజేస్తున్న కుటుంబీకులు

నవతెలంగాణ-ఆర్మూర్
గల్ఫ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని స్వదేశానికి క్షేమంగా రప్పించాలని కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహా నాయుడుని కలిశారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం గొల్లమాడ గ్రామవాసి కెసారాం జైరాం అనేక సంవత్సరాలుగా ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రస్తుతం దుబాయ్ లోని ఒక నిర్మాణ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు 15 రోజుల క్రితం జైరాం కు తీవ్ర అశ్వస్థత ఏర్పడి పక్షవాతం రావడంతో కంపెనీ అధికారులు దుబాయిలో ని ఒక హాస్పిటల్లో చేర్పించారు. అప్పటినుండి జైరాం నుండి ఏ విధమైన సమాచారం అందక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జైరాంకు సరైన చికిత్స చేయించి ఇంటికి క్షేమంగా రప్పించాల్సిందిగా ఆర్మూర్‌కు వచ్చి " ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక " అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడును శుక్రవారం కలిశారు. తమ కుటుంబ పెద్దను ఏ హాస్పిటల్ లో చేర్పించారో తెలుసుకొని వివరాలు తెలిపి క్షేమంగా ఇంటికి రప్పించాల్సిందిగా కోరుతూ కోటపాటికి వినతి పత్రం సమర్పించారు. కోటపాటి వెంటనే స్పందించి దుబాయ్ లోని ఇండియన్ ఎంబసికి , ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక దుబాయ్ కోఆర్డినేటర్ జంగం బాలకిషన్ లకు సమాచారం ఇచ్చి కెసారం జైరాంకు తగిన వైద్య సేవలు అందే విధంగా చూసి ఆరోగ్యం మెరుగైన తర్వాత ఇండియాకు పంపే ఏర్పాట్లు చేయాల్సిందిగా విన్నవించారు. ఇక్కడికి చేరుకున్న వెంటనే తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై సెల్ అధికారుల సహకారంతో రప్పించాలని, తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు వినతి పత్రం పంపించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దర్జాగా బెల్టు షాపుల దందా

- చూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

నవతెలంగాణ-ధర్పల్లి
ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లో ముడుపులు చెల్లిస్తూ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు దర్జాగా ప్రత్యేక షాపులు పెట్టి అమ్మకాలు కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలోని ఆయా వైన్స్ షాపులనుండి కొనుగోలు చేసిన మద్యాన్ని గ్రామాల్లో ప్రతిసీసాకు 10నుండి 20, 30 రూపాయల వరకు అదనంగా అమ్మకాలు కొనసాగించిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లోనైతే నివాసపు గృహాల్లో మద్యం అమ్మకాలు చేపడితే మరికొన్ని గ్రామాల్లో ఏకంగా గ్రామప్రధాన రహదారిపై షాపులు పెట్టి అమ్ముతున్నారు. ఈతతంగం అధికారులకు తెలియక నడుస్తుంటే పచ్చి అబద్ధమని అంటున్నారు. ప్రతి నెల సంబంధిత అధికారులకు మామూళ్లు ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తుంది. కొన్ని గ్రామాల్లో రాత్రిపూట మహిళలు మద్యం అమ్మకాల ప్రాంతం గుండా రహదారిపై వెళ్లేందుకు భయపడుతున్నారని ఆయా గ్రామాలవారు వాపోతున్నారు. వీటి నిర్వహణకు కొన్ని గ్రామాల్లో విడిసిలకు సంవత్సరానికి లక్షలు వెచ్చిస్తున్నారని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మనదేం పోతుందిలే మనకు వచ్చేది వస్తుందిగా అని సరిపెట్టుకుంటున్నారని చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు నిరోధించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.



వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు కృషి చేయాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన న్యాయవాది, తదితరులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
దేశంలో ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు తగిన కృషి చేయాలని, ఎఫ్పిఓల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని, ప్రముఖ న్యాయవాది టక్కరి హనుమంత్ రెడ్డి అన్నారు. భారత వ్యవసాయ అభివృద్ధికి రైతులను సంఘటిత పరిచి వారి ఉత్పత్తులను వారే అమ్ముకునే విధంగా రైతు ఉత్పత్తిదారులు ఎఫ్పిఓలను కేంద్ర ప్రభుత్వం దేశంలో పదివేల ఎఫ్పిఓలను ఏర్పాటు చేసి లక్ష కోట్ల రుణాలు అందిస్తుందని మరింత ఎఫ్పిఓల అభివృద్ధి పరిచే విధంగా వాటిపై తగిన కృషి చేసి రైతులను ఆదుకోవాలని ప్రముఖ న్యాయవాది పి.హనుమంతు రెడ్డి (టక్కరి) అన్నారు. నవీపేట కిషన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్పిఓ) లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ప్రగతి నగర్ వారి నివాసంలో 2025 క్యాలెండర్ పి.హనుమంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు తగిన కృషి చేయాలని వారు అన్నారు. ఆహారమంతా విషతుల్యమవుతున్న ఈ సందర్భంలో ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు తగిన కృషి జరపాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎఫ్పిఓ చైర్మన్ ఆర్. పృథ్వీరాజ్ మాట్లాడుతూ రైతులకు ఎఫ్పిఓలకు వారి ఉత్పత్తులను వాల్యూ ఎడిషన్ పొందాలని అన్నారు. ఇందులో సభ్యత్వం పొందిన రైతులను ప్రోత్సహించేందుకు నాబార్డ్ వారు ఇన్పుట్ సబ్సిడీలను అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని ఎన్సిఎస్ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించి బెల్లం కేంద్రంగా మార్చాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను పురుగుమందులను సబ్సిడీపై అందించాలని వారు అన్నారు. కార్యక్రమంలో ఎఫ్పిఓ డైరెక్టర్లు కె. ముత్యం, బీ సంజీవరెడ్డి, ఎం సాయిలు, ఇందూరు డిచ్‌పల్లి డైరెక్టర్ వేల్పూర్ భూమయ్య, బీ. బుల్లయ్య, ఏ.రాజారాం, సాయి ప్రసాద్, వి.రాజ్యలక్ష్మి, బి.రాజేశ్వర్, సిఈఓ అనీష్ రాజు, అకౌంటెంట్ తరుణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నిజాంసాగర్

నిజాంసాగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త వహిద్ ఇటీవల మరణించగా.. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే శుక్రవారం పరామర్శించారు. ఆయన కుమారులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మాజీ సర్పంచులు రాజు, రమేష్ గౌడ్, నాయకులు విజయ్ కుమార్, హైమాద్ ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

ప్లాట్ ఫారాలు ఖాళీ అయ్యేవరకు పంటను తీసుకురావొద్దు

- సింగిల్ విండో కార్యదర్శి జే బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సోయా పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రం వద్ద మార్కెట్ యార్డులోని ప్లాట్‌ఫారాలు నిండి ఉన్నందున వాటి తూకం పూర్తయి ప్లాట్‌ఫారాలు ఖాళీ అయ్యేవరకు సోయా పంట రైతులు తమ పంటను మద్దతు ధర కొనుగోలు కేంద్రానికి తీసుకురాకుండా సహకరించాలని మద్నూర్ సింగిల్ విండో కార్యదర్శి జె బాబురావు శుక్రవారం తెలిపారు. సోయా పంట మద్దతు ధర కొనుగోలు కేంద్రం వద్ద వందలాది క్వింటాళ్ల పంట ప్లాట్‌ఫారాలు నిండి ఉన్నందున తూకం కోసం తీసుకువచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా ప్లాట్ ఫారాలు ఖాళీ అయ్యేవరకు సోయా పంట రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తరలించకుండా సహకరించాలని విండో కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

సింగ్ సేవలు ఎనలేనివి



గాంధారి : సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



పొతంగల్‌లో..



నాగిరెడ్డిపేట్‌లో..

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతాపం

భారత మాజీ ప్రధాన మంత్రి, ప్రఖ్యాత ఆర్థిక వేత్త డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు అన్నారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న మన్మోహన్‌సింగ్.. గురువారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పలు మండల కేంద్రాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన దేశానికి, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

గాంధారి : మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు అమోఘమని ఆయన అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని భవానీ హాస్పిటల్‌ను ప్రారంభించారు. మండలంలోని లొంక తండాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అమర్ సింగ్ కుమారుని వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండలంలోని సోమారం గ్రామపంచాయతీ పరిధిలోని అవుసుల కుంట తండాకు చెందిన సురేఖ గ్రూప్ టు కు ప్రిపేర్ అవుతూ గత నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సురేఖ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తూర్పు రాజు, కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు బిసా గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సర్దార్ సింగ్, సంగని బాబా, సంఘని బాలయ్య, కమెల్లి బాలరాజ్, నీల రవి, గడ శంకర్, మోహన్ నాయక్, గణేష్ నాయక్, నాగరాజు, సాయిలు, పరశురాం నాయక్, సీతారాం నాయక్ పాల్గొన్నారు

పొతంగల్ : మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి నాయకులు సంతాప సభను నివాళులర్పించారు. అనంతరం విద్యావేత్త, ఆర్థికవేత్త, రాజకీయ రంగ ప్రవేశం చేసి, దేశానికి చేసిన సేవలను గుర్తుకుతెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట్ : భారతదేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌ను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పది సంవత్సరాల పాటు ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, క్రమశిక్షణ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య, గోపాల్‌పేట్ గ్రామ అధ్యక్షుడు శేఖర్, మైనార్టీ అధ్యక్షుడు ఇమామ్, నరసింహారెడ్డి, సుధాకర్, గులాం, మసూద్, మధు, కలీం, శ్రీరామ్ గౌడ్ తదితరులున్నారు.

రామారెడ్డి : మాజీ ప్రధానమంత్రి మాన్మోహన్ సింగ్ మృతి పట్ల రాజా బహుదూర్ వెంకట్రాంరెడ్డి ట్రస్ట్ సభ్యులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా రెడ్డి ఐక్యవేదిక సభ్యులు కామారెడ్డిలోని రాజిరెడ్డి గార్డెన్‌లో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగార్తి చంద్రారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం ఓ గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. భారతదేశ ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు దేశానికి ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మన్మోహన్ సింగ్‌కు దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగు సంతోష్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు, కొలిమి భీమ్‌రెడ్డి, నాగన్నగారి నరేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎర్రవాటి లింగారెడ్డి, సంగారెడ్డి, బాపురెడ్డితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య మాట్లాడుతూ.. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణ వార్త భారతదేశానికి తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందని తెలియజేస్తూ దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక రంగంలో దేశానికి ఆయన చేసిన కృషి ఎన్నటికీ మరువలేనిది అన్నారు. లెక్చరర్ స్థాయి నుంచి దేశ ప్రధాని వరకు ఎదిగి ఆర్థిక రాజకీయ రంగాలలో భారతదేశానికి ఆయన చేసిన సేవలు దేశ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యా నాయక్, మండలాధ్యక్షులు జూకంటి సంగారెడ్డి, సేవాదల్ జిల్లా అధ్యక్షులు లింగాగౌడ్, ఎస్సి విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గాదరి శ్రీనివాస్‌రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ లక్ష్మీపతి, ఎస్సీ విభాగం మండలాధ్యక్షులు కవిన్, గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య సీనియర్ నాయకులు వడ్ల రాజేందర్, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కోతి మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మొదేగం, గ్రామ అధ్యక్షులు లింగారెడ్డి, గ్రామ అధ్యక్షులు రాజయ్య, ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. వివాద రహితుడుగా అత్యంత సామాన్యునిగా మృదుస్వభావిగా, మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరొందిన మన్మోహన్ సింగ్ మృతి పట్ల బోధన్ రాజకీయ నాయకులు ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పిసిసి డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం దేశంలో నూతన ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా మన్మోహన్ సింగ్ చరిత్రలో నిలిచిపోయారని, పదేళ్లపాటు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పిసిసి డెలిగేట్ గంగా శంకర్, శివాలయ కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దాము, హర్షద్ పాషా, తల్లారి నవీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : భారత దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ చేసిన సేవలు ఎనలేనివని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచింది ఆయనేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేమాని నాగమణి వీర్రాజ్, గోపాల్, మైనార్టీ అధ్యక్షులు ఎమ్‌డీ భారీ, సాయిబాబు, మల్లేష్, అన్వర్, రాజు, రమేష్‌గౌడ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి సందర్భంగా సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానిగా ఉన్నసమయంలో అమలుచేసిన సంక్షేమ పథకాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మంధర్నా రవి, సాలురా గ్రామ అధ్యక్షులు అల్లే జనార్దన్, కేజీ గంగారాం, రిటైర్డ్ టీచర్ ఇల్తేపు గంగారాం, సొక్కం రవి, సాలురా లక్ష్మణ్, ఫతేపూర్ గౌస్, తగ్గెల్లి దేవరావు, హున్సా మూర్గే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : భారతదేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ, అడ్వకేట్ రామ్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ మృతి పట్ల కొవ్వొత్తులతో సంతాపం ప్రకటించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ అనారోగ్య రీత్యా గురువారము రాత్రి మృతి చెందడం బాధాకరమని అన్నారు. ఆయన నిర్వహించిన సంస్కరణలు ఎల్లప్పుడూ ప్రజలు స్మరించుకుంటూ నే ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జాంబిగే హన్మాండ్లు, మోహన్ రెడ్డి, బొడ్ల రాజు, మరగల దయానంద్, శేఖర్, ఇబ్రోజ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలో భారత దేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ సీనియర్ నాయకులు రామ్‌పటేల్ మాట్లాడుతూ.. ఇటు కాంగ్రెస్ పార్టీకి అటు భారతదేశానికి మన్మోహన్‌సింగ్ లేనిది తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్‌పటేల్‌తో పాటు సీనియర్ నాయకులు హనుమాన్లు, స్వామి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ధరాస్ సాయిలు, యూత్ మండలాధ్యక్షులు హనుమంతు యాదవ్, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుటుంబ సభ్యులు రమేష్, ఇతర నాయకులు రచ్చ కుషాల్, సంతోష్ మేస్త్రి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి లింగంపేట్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని మృతి చెందడంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయానికి తరలివచ్చారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మౌనం పాటించారు. ఆయన మృతికి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన చేసిన సంస్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్ నాయక్, లింగంపేట్ టౌన్ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, సమన్వయ కమిటీ సభ్యులు వంజరి ఎల్లమయ్య జక్సాని రవి, అట్టెం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు గోపాల్, పూల్‌సింగ్, మండల సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో..



బోధన్ పట్టణంలో..



వర్నిలో..



బోధన్ : సాలూరాలో..



రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



పిట్లంలో..



మద్నూర్‌లో..



లింగంపేట్‌లో..

బాల్య వివాహాన్ని అడ్డుకున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారులు



కుటుంబానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో శుక్రవారం బాల్య వివాహం చేస్తున్నట్లు 1098కు సమాచారం రావడంతో వారు స్థానిక చైల్డ్ వెల్ఫేర్ అధికారులను అప్రమత్తం చేయగా.. అధికారులు వివాహ స్థలానికి చేరుకుని వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన తల్లిదండ్రులు తమ కుమార్తెను బీబీపేట్ మండలం యాడారం గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిర్వహించే మండపానికి అధికారులు వచ్చి వయసు నిర్ధారణ చేయగా.. బాలిక మైనర్ అని తేలడంతో వివాహాన్ని నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం ఇరు కుటుంబాల సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం, కామారెడ్డి పట్టణంలోని సఖి కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఐసిడిఎస్ ఏఎస్ఐ కొండల్‌రెడ్డి ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ గోడప్రతుల ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం బోధన్ పట్టణంలో న్యూడెమోక్రసీ పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి గౌతమ్ కుమార్, నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతంకుమార్ మాట్లాడుతూ.. దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులు ప్రజల తరఫున పోరాడుతూ, ప్రారంభం నుంచే విప్లవ పార్టీలు చీలికకు గురవుతున్నాయని తెలిపారు.దీంతో ప్రజల్లో అసంతృప్తి కూడా పెరిగిందని అన్నారు. విప్లవ ఉద్యమాలు సన్నగిల్లాయని, విప్లవ కారులు ఆలోచన చేసి ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ ఐక్యం కావాల్సిన అవసరం నేడు ఏర్పడిందని అందులో భాగంగానే విప్లవకారుల ఐక్యత, రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభకు ప్రధాన వక్తగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్‌సింగ్ ఖట్కర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు చిన్న పర్వయ్య, సూర్య విట్టల్, దాల్ మల్కా పోశెట్టి, నాయకులు సుధాకర్, జైరామ్, అన్వార్, అఫ్రీద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమైనా పట్టించుకోరా..?



ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమ సమీపంలో ఎల్లారెడ్డి కామారెడ్డి రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఎలాంటి కంచెలేకుండా ప్రమాదకరంగా ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గతంలో పాడి గేదెను విద్యుత్ షాక్ గురై మృతిచెందిందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరో ప్రమాదం జరగకముందే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ధర్మసమాజ్ పార్టీ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షను శుక్రవారం ప్రారంభించారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు.. పేద మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబిసి ప్రజలందరికీ విద్యా వైద్యం, ఉపాధి, భూమి ఇల్లు సాధనకై కామారెడ్డి జిల్లా నాయకులు లక్ష్మణ్ మహారాజ్, రాజు ఆమరణ నిరాహార దీక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, జిల్లా నాయకులు రాజు మాట్లాడుతూ.. ప్రజలందరికీ న్యాయమైన ఉచిత విద్య, వైద్యం, భూమి, ఇల్లు సాధించేంతవరకు ఈ ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోలేశ్వర్, కోకన్వీనర్ అరవింద్, జిల్లా నాయకులు గంగరాజు, రాజు, నవీన్, శివరామకృష్ణ, సత్యం, శ్యామ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు కైవసం చేసుకున్న జిల్కార్ విజయానంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

26-27 హైదరాబాద్ నొవోటెల్ హెచ్ఐసిసిలో జరిగిన జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అలుమ్ని క్లబ్ జాతీయ సదస్సులో జరిగిన అవార్డ్స్ ఫంక్షన్‌లో 29 జోన్లు పాల్గొన్నాయి. నగరానికి చెందిన జిల్కార్ విజయానంద్‌కు జోన్ 12 నుండి 2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు "జాతీయ ఉత్తమ జేసిఐ అలుమ్ని క్లబ్ సభ్యుడిగా విన్నర్ అవార్డు" దక్కింది. జాతీయ చైర్మన్ అంబలగన్ అందజేశారు. 2024 రీజియన్, జోన్ స్థాయిలోనూ విజయానంద్‌కు విన్నర్ అవార్డులు దక్కాయి. జాతీయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని విజయానంద్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో జాతీయ అధికారులు వినయ్ మెహత, మనోజ్ టక్కర్, జోన్ 12 చైర్మన్ జివిఎన్ రాజు, జోన్ అధికారులు నవీన్ చవల్ల, డివిఎస్పి గుప్త, విశాఖ, శీతల్, శ్రీచందన, పూర్వ అధ్యక్షులు హరిదర్శన్ సలికే, సమీర్సా, వేముల చంద్రశేఖర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర సీఎం కప్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికవడం అభినందనీయం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి


క్రీడాకారులను అభినందిస్తున్న ఎంఈవో

ఈనెల 28 నుండి 31 వరకు మెదక్ జిల్లా స్టేడియంలో జరగనున్న రాష్ట్ర సాఫ్ట్ బాల్ సీఎం కప్ పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొర్లికొండ విద్యార్థులు చిక్కాల శ్రీ వర్షిని, బానోత్ రాజు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ అభినందించారు. జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరి క్రీడలలో పాల్గొనేలా ప్రోత్సాహం ఇస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత


చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మాజీ ఎంపీటీసీ రమేష్ శుక్రవారం అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆదేశాల మేరకు సిఎం రిలీఫ్ ఫాండ్ చెక్కులు అందచేయడం జరిగిందని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసి మద్దుల రమేష్, మాజీ సొసైటీ చెర్మన్ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్దుల శ్రీనివాస్, సాయంగౌడ్, శంకర్, మోహన్, రవి, కిషన్, దినేష్, నారాయణ, సాగర్, బాలయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సహాయం చెక్కులను శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న లబ్ధిదారులు ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రశాంత్‌రెడ్డి కృషితో గ్రామానికి చెందిన అచ్చ వరుణ్, ఊలెంగల సనత్ సూర్య, కౌడ సంజీవ్, బట్టు లక్ష్మి, బసకొండ దేవ్‌లకు ప్రభుత్వం ఆర్థిక సాయం చెక్కులను మంజూరు చేసింది. ఆ చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సదుల్లా రాజన్న, ఎస్సీ సెల్ మండల నాయకులు పాలేపు రవి కిరణ్, యూత్ అధ్యక్షులు రాకేష్, మనోజ్, పార్వతి రాజేశ్వర్, గడ్డం రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

కాంగ్రెస్ పార్టీ టౌన్ ఇంచార్జ్ ముస్కు మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రానికి చెందిన అనికేశి శ్రీనివాస్ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.17,500 చెక్కును అందజేశారు. మండలంలోని వెంచిర్యాల గ్రామంలో సైతం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు..

మామిడిపల్లిలో శతాధిక వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన మంగలి రాజు భాయ్ (108) శతాధిక వృద్ధురాలు శుక్రవారం మృతి చెందింది.. ఈమెకు ఐదుగురు కుమారులు,, ఒక కుమార్తె ఉన్నారు అంత్యక్రియలు స్వస్థలంలో నేడు నిర్వహించనున్నారు.

తాత్కాలిక అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

2న డెమో ద్వారా ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగర శివారులోని నాగారంలోగల గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం, సూక్ష్మ జీవశాస్త్రం, స్టాటిటిక్స్ బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనబ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్డీ, నెట్, సెట్ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలినారు. వచ్చే నెల 2న డెమో తరగతులు నిర్వహించి పూర్తి పారదర్శకంగా అభ్యర్థులను మెరిట్ ఆధారంగా రీజినల్ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

నేడు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 13వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో పరిమళించిన మానవత్వపు త్రోవలో (స్పందించే సేవా హృదయాలు)పేరిట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు మద్దుకూరి సాయిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కావున ప్రతి ఒక్కరు కార్యక్రమానికి విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి సహకారం ప్రోత్సాహం ఆదరణతోనే 13 ఏండ్లు పూర్తి చేసుకోని 14 సంవత్సరంలోకి అడుగుపెట్టిందని, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ అని ఆయన తెలిపారు.

ఆర్థిక వ్యవస్థకు ఆద్యుడు మన్మోహన్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల పలువురి నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ :భారత ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థాయిలో ఉన్న సమయంలో ఆద్యుడుగా నిలిచి పలు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన భారత ఆర్థిక శిల్పి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన మన్మోహన్ సంతాప సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి బార్ అసోసియేషన్ తరుపున రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ..దేశ ఎగుమతులు, దిగుమతులకు సరిపడ విదేశీ ద్రవ్యం లేని పరిస్థితిలో నూతన ఆర్థిక సంస్కరణలు 1991లో ప్రవేశపెట్టి ఆర్థిక మంత్రిగా దేశ ప్రజలమన్ననలు చూరగొన్న ఆర్థికవేత్తగా అభివర్ణించారు. వ్యాపార వాణిజ్య రంగాల్లో భారత కీర్తిప్రతిష్ఠలు శిఖరాగ్రానికి చేర్చిన రూపశిల్పిగా పేర్కొన్నారు. దేశ ప్రధానమంత్రిగా కూడా మరిన్ని ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చారని, ప్రజలకు అందుబాటులోకి నూతన చట్టాలను చేర్చిన ఆచరణ శీలి మన్మోహన్ అని తెలిపారు. దేశ ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా ఎనలేని సేవలు అందించిన ఒక మేధావిని దేశం కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ న్యాయవాది అమిదాల సుదర్శన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్పల్లి రాజేశ్వర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, ఆకుల రమేశ్, ఆశ నారాయణ, ఆర్.రాజలింగం, తదితరులు డాక్టర్ మన్మోహన్ సింగ్ భారాతవనికి చేసిన ప్రగతిఫలాలు నేడు దేశ ప్రజలు అనుభవిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు పెండెమ్ రాజు, కార్యదర్శి దొన్పల్ సురేశ్, కోశాధికారి దీపక్, అయ్యూబ్, మనిక్ రాజ్ రవి, పులి జైపాల్, న్యాయవాదులు పాల్గొన్నారు


నివాళ్లు అర్పిస్తున్న న్యాయవాదులు

ముప్కాల్:మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టౌన్ ఇంచార్జ్ ముస్కు మోహన్, అబ్రార్, ప్రశాంత్ రెడ్డి, రఫీ, సాజిత్, శ్రీనివాస్, శంకర్ పటేల్, రవి, పవన్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



దేశానికి తీరని లోటు

రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మాజీ ప్రధానిగౌరవ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రపంచంలోనే ఆర్థిక శక్తిగా నిలబెట్టిన ఘనుడు, దేశాన్ని తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించిన మహా ఆర్థిక మేధావి అని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి హెూదాలో తొలిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ చారిత్రాత్మకంగా నిలిచిపోయిందని, ప్రత్యక్ష పన్నుల విధానాన్ని సరళీకరించారని తెలిపారు. దీంతో బ్లాక్ మనీకి చాలావరకు అడ్డుకట్ట వేశారని, నిరంతరాయంగా రెండు పర్యాయాలు దేశ ప్రధానిగా సేవలందించారని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ చేసిన సేవలు దేశం ఎన్నటికి మరిచిపోలేదని, నీతి, నిజాయితీ, మంచితనం, సమర్థత, వంటి లక్షణాలు మన్మోహన్ సింగ్‌ను చూసి నేర్చుకోవాలని తెలిపారు

మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


నివాళ్లు అర్పిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల ధర్నా చౌక్ వద్ద దీక్షా శిబిరంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజు మాట్లాడుతూ.. రెండు సార్లు దేశ ప్రధానిగా, మచ్చలేని రాజనీతిజ్ఞుడిగా, పీ.వి నరసింహారావు హయాంలో తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించిన మహనీయుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గారు మరియు కోశాధికారి ప్రసాద్ మహిళా అధ్యక్షురాలు గంగామణి సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షులు శివన్నోళ్ల శివ కుమార్ మాట్లాడుతూ... దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి దేశాభివృద్ధికి పాటుపడిన మన్మోహన్ సింగ్ లేకపోవడం భాధకార విషయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం జీవన్, ముస్కు మోహన్ రెడ్డి,రేండ్ల రాజారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, దండేవోయిన సాయికుమార్, ఓర్సు రాములు పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వృత్తి ఫొటోగ్రఫీ.. ప్రవృత్తి ధ్యానం

• హాబీ నాణేల సేకరణ • ధ్యానం క్లాసుల నిర్వహణ

నవతెలంగాణ - బాల్కొండ

ఆయన వృత్తి ఫొటోగ్రఫీ.. ఫొటోలు తీయడం 40 సంవత్సరాలుగా ఫొటోగ్రఫీలో ఉంటూ తన పని తాను చేసుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలని ఒక లక్ష్యంతో ఆయన నాణాల సేకరణ చేస్తుంటారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ధ్యానం క్లాసులను నిర్వహిస్తూ అందరి మన్ననల పొందుతున్న బాల్కొండ మండల కేంద్రానికి చెందిన సింధుల రాజేందర్ ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి. బాల్కొండ మండలంలోని ఇత్వార్ పేట్ గ్రామంలో జన్మించి ఫొటోగ్రఫీలో మెళుకువలు నేర్చుకొని బాల్కొండలో ఫొటో స్టూడియోను పెట్టి అంచలంచలుగా ఎదుగుతూ ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ వారికి జీవనోపాధిని చూపించారు. అంతేకాకుండా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అవగతం చేసుకొని వాటికి అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసుకొని తన వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ బాల్కొండ పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తున్నారు .


సేకరించిన నాణేలు, కరెన్సీ నోట్లు

ఆరోగ్యం కోసం ధ్యానం క్లాసుల నిర్వహణ

ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యంగా ఉంటే అన్నీ ఉన్నట్లే అని బాల్కొండ పరిసర ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతిరోజు బాల్కొండ మండల కేంద్రంలో ధ్యానం క్లాసులను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఎక్కడైనా సమావేశాలు నిర్వహించిన సభలు నిర్వహించిన అక్కడికి వచ్చిన ప్రజలందరికి ధ్యానం ప్రత్యేకతను తెలియజేయడం వారిచేత ధ్యానం చేయించడం దీంతో వేలాది మందికి ఆదర్శంగా నిలిచిన రాజేందర్ కు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

అభిరుచిగా నాణేల సేకరణ

తన వృత్తి ఫొటోగ్రఫీతో పాటు తనకున్న హాబీ నాణేల సేకరణ ఎంచుకొని స్వాతంత్ర్యం ఏర్పడిన తర్వాత వచ్చిన నాణేలన్నిటిని కూడా సేకరించి దాచారు. నాణేలను సేకరించడం తన హాబీగా మల్చుకొని దాదాపు కొన్ని వందల సంఖ్యలో నాణేలను సేకరించారు.



మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మాక్లూర్



మండలంలోని చిక్లి గ్రామంలో అప్పుల బాధతో గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం చిక్లీ గ్రామానికి చెందిన కారం మహేందర్ (45) కొత్త ఇల్లు కట్టుకోవడానికి అప్పులు చేశాడు. ఈ విషయంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల గురువారం రాత్రి 11 గంటలకి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఇస్సపల్లి గ్రామం నుండి మిర్దాపల్లికి ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఒకరు మృతి చెందినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. గ్రామం నుండి ట్రాక్టర్ డ్రైవర్ సుదర్శన్ అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇటుకలను లోడ్ చేసుకొని వాహనం అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపారని, డ్రైవర్ టర్న్ తీసుకోవడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో దినసరి కూలీ లక్ష్మయ్య(20) మృతి చెందినట్లు తెలిపారు. ఘటనా స్థలంలోనే మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా

• ఒకరికి మూడు రోజుల జైలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 11 మందికి జరిమానా విధించగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 12 మందికి ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం 12 మందిని రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నూర్జాన్ 11 మందికి 15500 జరిమానా విధించి చంద్రశేఖర్ కాలనీకి చెందిన షేక్ అబ్బాస్ అనే వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారని సిఐ తెలిపారు.

మూడు రోజుల జైలు శిక్ష

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ రఘుపతి శుక్రవారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ కేంద్రంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 26న గాంధీచౌక్‌లో ఇన్‌స్పెక్టర్ రఘుపతి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అస్సాం కాలనీకి చెందిన ఆర్బస్ ఖాన్ అనే వ్యకిని ఇతన్ని చెక్ చేయగా మోతాదు 513 ఎంజీ మద్యం సేవించి నట్లుగా తేలింది. దీంతో అర్బజ్ ఖాన్ ను న్యాయస్థానం ముందు హాజరుపరచగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధించగా ఆ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్ఓ తెలియజేశారు.

సీసీ నిఘా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోగల ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాను గుర్తు తెలియని వారు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు వాపోతున్నారు. గతంలో ఎస్ఐ వంశీ కృష్ణ ఆధ్వర్యంలో మూడు కెమెరాలు ఇదే చౌరస్తాలో ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారి కావడం ఇక్కడి నుండి ప్రతిరోజు వందల వాహనాలు రాకపోకలు కొనసాగుతుండడంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అప్పటినుండి కొందరు రోడ్లపై బైకులు పెట్టి వాటిపై కేకులు కోయడం లాంటి పనులు జరగకుండా అలాగే సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం, వాటి ఆవరణలో కొందరు యువకులు రాత్రి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది, ఇప్పుడు చౌరస్తాలో ఉన్న ఒకేమారను తొలగించారు . మరో రెండు పనిచేయడంలేదని గ్రహించి ,మళ్లి కొందరు చౌరస్తాలో కేకులు కట్ చేసే సంస్కృతిని కొనసాగిస్తున్నారని , అలాగే ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అర్థ రాత్రివరకు గప్పాలు కొట్టుతూ ,గుంపులు గుంపులుగా పోగై మంతనాలు చేస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు . పోలీసులు స్పందించి చౌరస్తాలో సిసి కెమెరాల పనితీరుపై దృష్టి సాధించాలని ,రోడ్లపై కేక్ కటింగ్ ,పుట్టిన రోజులు జరుపుకోకుండా నివారించాలని కాలనీవాసులు కోరుతున్నారు .



చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్ఎహెచ్‌వో సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యాదగిరి నాగేంద్ర (21) మండలంలోని అంకాపూర్‌కు వలస వచ్చాడు. ఈనెల 21న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు

- కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం చాలా బాధాకరమని కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయిందని, మన్మోహన్ సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆయన పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ దేశానికి అవిశ్రాంతంగా సేవలందించారని కొనియాడారు. 'మన్మోహన్‌సింగ్ మరణం చాలా బాధాకరం. దేశం గొప్ప ఆర్థిక సంస్కర్తను కోల్పోయింది. దేశానికి మన్మోహన్‌సింగ్ అవిశ్రాంతంగా సేవలందించారు. దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారనీ, ఉపాధి హామీ, ఆధార్, ఆర్టీఐ, విద్యా హక్కు చట్టం తీసుకొచ్చారని, అనేక పదవులను మన్మోహన్ సమర్థంగా నిర్వహించారు. దేశాన్ని ఆర్థికంగా మన్మోహన్ కొత్త పుంతలు తొక్కించారు. మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయమైనవి.' అని పేర్కొన్నారు.

కామారెడ్డి గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.విజయ పాల్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.విజయ్ పాల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు. విజయ పాల్‌రెడ్డి ఇంతకు క్రితం హైదరాబాద్ రాజీవ్ స్వగృహలో పనిచేశారు.


కలెక్టర్‌కు పూలబొకేను అందజేస్తున్న విజయ పాల్‌రెడ్డి



జిల్లా కేంద్రంలోని పలు ప్రయివేటు పాఠశాలలు నిబంధనలు పాటించట్లేదు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ స్కూల్ యాజమాన్యం నిబంధనలు పాటించకపోవడంతో ఇటీవలే విద్యార్థి సంఘాలు ఆ పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమస్యలపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

నిబంధనలు పాటించట్లే..!

లిటిల్ స్కాలర్ స్కూల్‌పై చర్యలేవి?.. పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్ పాఠశాల యజమాన్యం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా తమ పాఠశాలను నడుపుతున్నారు. 1500 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో విద్యార్థులు ఆడుకోవడానికి 100 గజాల స్థలం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. నిర్మాణ దశలో ఉన్న భవనంలో విద్యార్థులకు తరగతి గదులు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. భవనం నిర్మాణం దశలో ఉండడం వలన సిమెంటు, ఇసుక, దుమ్ము, ధూళీ, కంకర లాంటి వ్యర్థాలతో విద్యార్థుల ఆరోగ్యం క్షీణించి మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.


పాఠశాల నిర్వహిస్తున్న భవనం ఇదే..

గత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో లిటిల్ స్కాలర్ స్కూల్ బయట ఓ గదిని అద్దెకు తీసుకొని అందులో ఆ పాఠశాలకు సంబంధించిన ఆ పాఠశాల యూనిఫారాలను విక్రయిస్తుండగా విద్యార్థి సంఘాలు వెళ్లి అడ్డుకున్నారు. వారిపై కేసు సైతం నమోదైంది. ఈ విషయంపై అప్పటి బీఆర్ఎస్ ప్రముఖ రాజకీయ నాయకుడు మండల విద్యాశాఖ అధికారి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ చేసి చెప్పారని భూతులను తిట్టినట్లు సమాచారం. దాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు ఆ పాఠశాలపై విద్యార్థి సంఘాలు ఎన్ని ఆరోపణలు చేసినా.. వాస్తవాలను కండ్లకు కట్టినట్టు చూపించిన విద్యాశాఖ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు, ఆటస్థలం లేదని విద్యార్థి సంఘాల నాయకులు పలుసార్లు ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేసి సమస్యలపై వివరించినా, ఇప్పటివరకు విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అనుమతి లేని బిల్డింగ్‌లో సిమెంట్ బస్తాల మధ్య విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారని విద్యార్థి సంఘాల నాయకులు గతంలో వెల్లడించినా ఇప్పటివరకు స్థానిక ఎంఈఓ, జిల్లా అధికారి గానీ స్పందించిన దాఖలాలు లేవు. అధికారులు ఇప్పటివరకు కూడా ఆ స్కూలును తనిఖీలు చేయలేదు.

విద్యాహక్కు చట్టం వీరికి వర్తించదా..?

విద్యాహక్కు చట్టం ప్రకారం పదిమంది విద్యార్థులకు టాయిలెట్, మరుగుదొడ్లు ఉండాలి. గదులు విస్తారంగా, వెలుతురు, గాలి వచ్చే విధంగా ఉండాలి. ఒక్కో విద్యార్థికి కనీసం 1 చదరపు మీటరు ప్రదేశం ఉండాలి. 40 మంది విద్యార్థులకు కనీసం 300 చదరపు అడుగుల గది ఉండాలి. భవనంతో పాటు ఆటస్థలం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2 ఎకరాల భూమి ఆ పాఠశాల కలిగి ఉండాలి. ఫీజులు నిర్ణయించే గవర్నింగ్ బాడీ కమిటీ లేకుండానే ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. లిటిల్ స్కాలర్ స్కూల్లో విద్యా హక్కు చట్టం అమలు కావడం లేదని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

కలెక్టర్ స్పందించాలంటున్న ప్రజలు..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ పాఠశాలతో పాటు కార్పొరేట్ పాఠశాలలు సైతం అపార్ట్‌మెంట్లలో కొనసాగుతున్నాయి. వీటిని అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు రాజకీయ నాయకులకు భయపడుతూ వాటి జోలికి వెళ్లడం లేదు. కలెక్టర్ స్పందించి ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కామారెడ్డి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నడుపుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. ఫీజులు వసూలు చేయడంలో కనీస నిబంధనలు పాటించడం లేదు. గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయకుండానే అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యార్థులకు మానసిక వికాసం కోసం గేమ్స్ ఆడించడానికి ఆట స్థలాలు లేవు. ఎన్నిసార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు ఎవరికీ భయపడకుండా ఇలాంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

\- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ కుమార్

ఇలాంటి పాఠశాలలను వెంటనే మూసివేయాలి



నిర్మాణ దశలో ఉన్న భవనంలో విద్యార్థులకు తరగతి గదులు నిర్వహిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. భవనం నిర్మాణం దశలో ఉండడం వలన సిమెంటు, ఇసుక, దుమ్ము, ధూళీ, కంకర లాంటి వ్యర్థాలతో విద్యార్థుల ఆరోగ్యం క్షీణించి మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుండా విద్యను వ్యాపారం చేస్తూ విద్యాశాఖ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. అధికారం ఉందన్న ధీమాతో అధికారులను బెదిరిస్తున్నారు.

\- భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విట్టల్

దేశానికి తీరని లోటు

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-కామారెడ్డి

మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని, ఆయన ప్రధానిగా ఉన్న హయాంలో తెలంగాణ రావడానికి కీలకంగా వ్యవహరించారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్ను మూసిన విషయం తెలిసిందే. ఆయన మరణంతో శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సలదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికే కాకుండా ప్రపంచ దేశాలు ఆర్థిక సందిగ్ధంలో ఉన్న సమయంలో తన సలహా ద్వారా ఎన్నో దేశాలను ఆర్థిక సంక్షోభం నుండి బయట పడేశారన్నారు. మన్మోహన్ సింగ్ 2004 నుంచి 2014 వరకు దేశ ప్రధానిగా పనిచేశారని, ఈ సమయంలో కీలకమైన ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేశారన్నారు. ప్రధానిగా నెహ్రూ, ఇందిరాగాంధీ, నరేంద్ర మోదీ తర్వాత అత్యధిక కాలం దేశ ప్రధానిగా ఆయన కొనసాగారని వివరించారు. మన్మోహన్ సింగ్ దాదాపు 33 ఏళ్ల పాటు పార్లమెంట్ సభ్యుడిగా సైతం కొనసాగారన్నారు. 1991లో రాజ్యసభలో అడుగుపెట్టిన మన్మోహన్ సింగ్, ఆనాడు ప్రధానిగా పీవీ నరసింహారావు ఉన్న సమయంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్థిక శాఖలో సలహాదారుగా, కార్యదర్శిగా, ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేశారన్నారు. 1991లో దుర్భర ఆర్థిక పరిస్థితుల నుంచి దేశాన్ని గట్టెక్కించడానికి మన్మోహన్ సింగ్‌ను రాజ్యసభకు పంపి ఆర్థిక మంత్రిగా చేశారని వివరించారు. లిబరలైజేషన్, ప్రివలైజేషన్, గ్లోబలైజేషన్ పాలసీతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత మన్మోహన్ సింగ్‌దేనని అన్నారు. ప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల ప్రైవేటీకరణ ద్వారా నాటి సంస్కరణలు చిరస్థాయిగా నిలిచి పోయాయని అన్నారు. 1991 నుంచి 1996 వరకు ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారని, ఆయన హయాంలోనే అత్యధిక జీడీపీ 10.2శాతం వృద్ధి రేటు నమోదవ్వగా, వెనుకబడిన వర్గాలకు 27 శాతం సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియా చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇలియాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, అనంతరెడ్డి, భీమ్‌రెడ్డి, అబ్రబోయిన స్వామి, భూమిరెడ్డి, నాయకులు బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మినుకూరి బ్రహ్మానందరెడ్డి, కారంగుల అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలు చల్లుతున్న షబ్బీర్ అలీ

రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేద్దాం

- టీఎస్‌యూటీఎఫ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు
- మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

నల్లగొండ జిల్లాలో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు కోరారు. కామారెడ్డి జిల్లా కామరెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్య చేతుల మీదుగా గోడ ప్రతులను ఆవిష్కరించారు. నల్లగొండలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలలో "అధ్యాపనం సామాజిక స్పృహ- లక్ష్యం"తో "హక్కులు -బాధ్యతలు" 1.భారత ఆర్థిక వ్యవస్థలో మధ్యతరగతి ప్రజలకు ఏం జరుగుతుంది?, 2.విద్యలో రాజ్యాంగం విలువలు, 3. జాతీయ విద్యా విధానం- ప్రభుత్వ విద్యపై ప్రభావం మొదలగు అంశాలపై విషయ వివరణ చర్చ ద్వారా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. ఈ మహాసభలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ ఆలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎంపీ కుందూరి రఘువీర్‌రెడ్డి, ఎంపి కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కే జంగయ్య, టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరవుతున్నారని పేర్కొన్నారు. కావున ఉపాధ్యాయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ సీనియర్ నాయకులు నరసింహారావు, జిల్లా కోశాధికారి రూప్సింగ్, జిల్లా కార్యదర్శులు సాయి గౌతమ్, బాలయ్య, నాంపల్లి, శ్రీహరి, నరేందర్, రత్నం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మహాసభల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎంఈవో, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరెడ్డిని హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. లింగంపేట్ ఎమ్మార్వో చెట్లపల్లి నరేందర్‌గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడిగా గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. నూతనంగా తెలంగాణ తహశీల్దార్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడుగా చెట్లపల్లి రాజా నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రావ్ కామారెడ్డి జిల్లాకు సంబంధించిన సభ్యులందరూ తెలంగాణ తహశీల్దార్ సంఘం (టిజిటిఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ లచ్చిరెడ్డిని, అదేవిధంగా టిజిటిఏ రాష్ట్ర అధ్యక్షులు రాములును మర్యాద పూర్వకంగా హైదారాబాద్‌లో రాష్ట్ర కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కామారెడ్డి జిల్లా తహసిల్దార్ అసోసియేషన్ నూతనంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన చెట్లపల్లి నరేందర్ గౌడ్‌ను అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతగా పనిచేయాలని వారు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం మరింత బాధ్యతను అప్పగించారని సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సకాలంలో స్పందిస్తానన్నారు. అందరికీ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.


లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బూత్‌స్థాయి అధ్యక్షుల ఎన్నిక

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో పెద్దమ్మ ఆలయంలో బీజేపీ పార్టీ మండల కార్యకర్తల సమావేశాన్ని బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు విపుల్ జైన్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఆదేశాల మేరకు దోమకొండలో బీజేపీ పార్టీ 93వ బూత్ అధ్యక్షుడిగా నీల అరుణ్ కుమార్, 94వ బూత్ అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి, 95వ బూత్ అధ్యక్షుడిగా నాయిని కృష్ణారెడ్డి, 96వ బూత్ అధ్యక్షుడిగా మామిడ్ల నవీన్, 97వ బూత్ అధ్యక్షుడిగా నరేష్, 98వ బూత్ అధ్యక్షుడిగా వేణు, 99వ బూత్ అధ్యక్షుడిగా యశ్వంత్‌గౌడ్, 100వ బూత్ అధ్యక్షుడిగా ప్రభాకర్, 101వ బూత్ అధ్యక్షుడిగా నర్సింలు, 102వ బూత్ అధ్యక్షులుగా చిట్యాల రవీందర్‌రెడ్డి, 103వ బూత్ అధ్యక్షురాలుగా అంజలి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పార్టీ గెలుపు కోసం కృషి చేశారని, రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ, సహకార సొసైటీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ నాయకులను గెలిపించుకొని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డికి బహుమతిగా అందజేసి పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో విజయానికి, పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బూత్ అధ్యక్షుల పాత్ర కీలకం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు కుంట లక్ష్మారెడ్డి, భూపాల్‌రెడ్డి, రవీంద్రర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆరట్టు మహోత్సవం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ఉత్తర శబరిమళ అయ్యప్ప ఆరట్టు మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఉత్తర శబరిమళ అయ్యప్పా సేవాసమితి గురుస్వాములు తెలిపారు. కేరళలోని శబరిమళలో సంవత్సరానికి ఒకసారి సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆరట్టు కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శుక్రవారం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రంలో ప్రధాన పురవీధుల గుండా అయ్యప్ప స్వాములంతా కలిసి ఊరేగించారు. స్వామివారికి తిరు ఆభరణాలను ధరించి శోభయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామికి శక్రాస్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు చంద్రమౌళి, రవిగౌడ్, శ్రీకాంత్, సిద్ధ గౌడ్గురు స్వామి, రవి, లింగాగౌడ్ గురుస్వామి, లక్ష్మీనారాయణగౌడ్, నగేష్, సత్యనారాయణ, అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.


ఆరట్టులో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు బిఎన్ ఫౌండేషన్ క్రీడాకారిణి

నవతెలంగాణ-గాంధారి

జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు పొతంగల్ కలాన్ గ్రామానికి చెందిన సంజన ఎంపికైనట్టు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 5 వరకు మెదక్ జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో కామారెడ్డి జిల్లా బాలికలు నాలుగో స్థానం సాధించారు. ఈ నెల 27 నుంచి 30 వరకు పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వారు తెలిపారు. బామన్ నాయక్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న సంజన ఇదివరకు రెండుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఆమె ఎంపిక పట్ల ఫౌండేషన్ చీఫ్ ప్యాట్రన్ గుగులోత్ సురేందర్, అధ్యక్షురాలు సేవంత రాథోడ్, సభ్యులు అభినందించారు.



బోధన్ కోర్టు ఆవరణ శుభ్రపరచాలని మెజిస్ట్రేట్ వినూత్న తీర్పు

నవతెలంగాణ-బోధన్ టౌన్

రెండు వేరు వేరు కేసుల్లో పట్టుబడ్డ నిందితులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వినూత్న తీర్పు ఇచ్చినట్లు బోధన్ టౌన్ సిఐ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణ పరిధిలోని బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ముగ్గురు యువకులను, అలాగే రాకాసిపేటలోని గోసంగి కాలనీలోని గొడవ పడినందుకు ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. 8 మందిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో పరిసరాలను శుభ్రపరచాలని తీర్పునిచ్చారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్

బోధన్ కోర్టులో శుక్రవారం చీటింగ్ కేసు ఘటనలో న్యాయమూర్తి పూజిత ఆవుల జగన్ మోహన్‌రావు, ఆవుల జీవన్ బాబు అనే వ్యక్తులకు ఒక సంవత్సరం 3 నెలల జైలుశిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ తెలిపారు. 2013లో జరిగిన చీటింగ్ కేసులో వీరిద్దరు నిందితులని పేర్కొన్నారు. ఈ కేసు విచారణకు సహకరించిన పట్టణ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ కిషన్, కోర్టు కానిస్టేబుల్ సృజన్, లక్ష్మణ్‌ను ఇంచార్జి సీపీ సింధుశర్మ అభినందించారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణానికి చెందిన అరుగొండ మహేష్ (30) అనే యువకుడు గత కొన్ని రోజులుగా కడుపునొప్పితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అయితే కడుపునొప్పి తీవ్రం కావడంతో దానిని భరించలేక గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయి సాలూరు శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుని భార్య అరగొండ మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాలంపాడ్‌లో దొంగతనం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని సాలంపాడ్ గ్రామంలో ఎడపల్లి నర్సారెడ్డి అనే వ్యక్తి ఈనెల 21వ తేదీన ఇంటికి తాళం వేసుకొని హైదరాబాద్‌లోని బంధువుల పెళ్ళికి వెళ్లారు. పెళ్లి అనంతరం 26వ తేదీన తిరిగి సాలంపాడ్‌కు రాగా తన ఇంటి తాళం పగులగొట్టి ఉందని, ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి అందులోని రెండు తులాల బంగారం, నాలుగు తులాల వెండి, 25వేల నగదు అపహరణకు గురైందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు.